

చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 20 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3, నరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
38.8°/22.5°

జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఆనర్స్‘డిగ్రీ’ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సులు బీఏ హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఇంగ్లిష్, బీకాం జనరల్, బీఎస్సీ గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కళాశాలలోని ఆయా విభాగాల్లో ఈ నెల 9లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 2020–21 విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరి 2023లో పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ నేరుగా చివరి ఏడాది ఆనర్స్ డిగ్రీలో చేరవచ్చని వెల్లడించారు. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అవకాశం ఉంటుందన్నారు. నూతన విద్యా విధానం ప్రకారం నిర్వహిస్తున్న కోర్సుల్లో భాగంగా మొదటిసారి నాలుగేళ్ల కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు వర్సిటీల్లో మరో ఏడాది పాటు చదివితే పీజీ పూర్తవుతుందన్నారు. ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

సచివాలయాల్లోనే ‘ఓపెన్’ అడ్మిషన్లు



ఓపెన్ స్కూల్ పోస్టర్లు విడుదల చేస్తున్న లాజర్ తదితరులు

తాడిమర్రి: ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు సమీపంలోని సచివాలయంలోనే చేసుకోవచ్చని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.లాజర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్‌ఎం అరుణ, ఎంఈఓ కృష్ణమోహన్‌లతో కలసి ఓపెన్ స్కూల్ ప్రవేశాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా లాజర్ మాట్లాడుతూ.. 14 ఏళ్ల నిండిన ఎవరైనా ఓపెన్ స్కూల్‌లో చేరవచ్చన్నారు. బడి మానేసిన, పదో తరగతి ఫెయిల్ అయిన వారు, చిరుద్యోగులు, వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్నవారు, చదువు కొనసాగించాలనుకునే మహిళలకు ‘ఓపెన్ స్కూల్’ చక్కని అవకాశమన్నారు. ‘ఓపెన్ స్కూల్’ లో పదో తరగతి పూర్తి చేసిన వారు ఒకే ఏడాది ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ధర్మవరం, బత్తలపల్లి ఎంఈఓలు గోపాల్ నాయక్, సుధాకర్, సీఆర్పీ ఆనంద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాయ్ రాజా కాయ్

- పని నిమిత్తం గత శుక్రవారం హిందూపురం వెళ్లిన ఓ వ్యక్తి రాత్రి బస చేసేందుకు లాడ్జీకి వెళ్లగా గదులు లేవనే సమాధానం వచ్చింది. అన్‌సీజన్‌లోనూ అంత డిమాండ్ ఎందుకని ఆరా తీయగా...ఆ రోజు క్రికెట్ వరల్డ్ కప్ ప్రారంభమైనట్లు తెలిసింది. గదులు తీసుకున్న వారంతా వరల్డ్ కప్ మ్యాచ్ చూస్తూ గడిపేశారు. ఇందులో కొందరు జోరుగా బెట్టింగ్ కాసినట్లు సమాచారం.
- కొన్ని పట్టణాల్లో కొందరు ప్రత్యేకంగా ఇళ్లను అద్దెకు తీసుకొని పెద్దపెద్ద టీవీలు ఏర్పాటు చేసుకొని మరీ బెట్టింగ్‌లు కాస్తున్నట్లు తెలుస్తోంది.
- మరికొందరు పట్టణ శివారు ప్రాంతాల్లోని ఫాం హౌస్‌లను అద్దెకు తీసుకుని మద్యం సేవిస్తూ క్రికెట్ బెట్టింగ్‌లు వేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే శుక్రవారం పాకిస్థాన్–నెదర్లాండ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా లేపాక్షి దగ్గర ఉన్న ఓ ఫాం హౌస్‌లో బెట్టింగ్ రాయుళ్ల మధ్య పెద్ద గొడవే జరిగినట్లు తెలుస్తోంది.
- నేడు భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య వన్డే ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీలో ఇది భారత్‌కు తొలి మ్యాచ్ కావడంతో బెట్టింగ్‌లు భారీగా నిర్వహించేందుకు బుకీలు సిద్ధమైనట్లు తెలుస్తోంది.



- వరల్డ్ కప్ వేళ జోరుగా క్రికెట్ బెట్టింగ్
- లాడ్జీలు, ఫాంహౌస్‌లలో మకాం వేస్తున్న యువత
- మద్యం మత్తులో భారీగా బెట్టింగ్ వేసి నష్టపోతున్న వైనం
- రోజూ రూ.కోట్లలోనే సాగుతున్న వ్యవహారం

కదిరి: వన్డే వరల్డ్ కప్ వేళ క్రికెట్ ఫీవర్ యువతను పట్టి పీడిస్తోంది. ఎవరి నోట విన్నా వన్డే ప్రపంచ కప్–2023 క్రికెట్ మాటే వినబడుతోంది. కొందరు మ్యాచ్‌లు చూస్తూ ఎంజాయ్ చేస్తుంటే...మరికొందరు మాత్రం బెట్టింగ్‌లు వేస్తూ అకౌంట్‌లు ఖాళీ చేసుకుంటున్నారు. ఈ నెల 5వ తేదీన ఇంగ్లాండ్–న్యూజిలాండ్ జట్ల మధ్య తొలిపోరు మొదలైంది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ జట్టును ఓడించింది. ఆ రోజు జిల్లా వ్యాప్తంగా భారీగా క్రికెట్ బెట్టింగ్‌లు జరిగినట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్ గెలుస్తుందని బెట్టింగ్ వేసిన వారంతా భారీగా నష్టపోయినట్లు సమాచారం.

క్షణక్షణం బెట్టింగ్..
వన్డే ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్ ఛానల్‌తో పాటు హాట్‌స్టార్ యాప్‌లో కూడా ప్రసారం చేస్తోంది. దీంతో సెల్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు ఎక్కడినుంచైనా మ్యాచ్ వీక్షించే అవకాశం కలిగింది. దీంతో పందెం రాయుళ్లు మ్యాచ్‌లు ఆస్వాదిస్తూనే భారీగా బెట్టింగ్ వేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు ఇలా బెట్టింగ్ ఊబిలోకి దిగుతున్నారు. ఈ మాయలో పడి అప్పులపాలవుతున్నారు.

టాస్ నుంచే ప్రారంభం..
కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, హిందూపురం, రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లోని అన్ని ప్రధాన పట్టణాల్లోనే కాకుండా..కొన్ని మండల కేంద్రాల్లో కూడా క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. బెట్టింగ్ రాయుళ్లు టాస్ నుంచి పందేలు వేస్తున్నారు. టాస్ ఎవరు గెలుస్తారు..?, ఈ ఓవర్‌లో ఎన్ని సిక్స్‌లు కొడతారు...? ఎన్ని ఫోర్లు కొడతారు? వికెట్ పడుతుందా లేదా?..ఫలానా క్రికెటర్ మొత్తం ఎన్ని పరుగులు చేస్తాడు? ఫలానా బౌలర్ ఎన్ని వికెట్లు తీసుకుంటాడు?..ఈ మ్యాచ్‌లో ఫలానా జట్టు ఎన్ని పరుగులు చేస్తుంది?.. ఇలా పలు రకాలుగా బెట్టింగ్‌లు వేస్తున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..
బెట్టింగులన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతుండటంతో బెట్టింగ్ రాయుళ్లకు కలిసి వస్తున్న అంశం. గతంలో అయితే బెట్టింగ్ నగదు రూపంలో చెల్లించే వారు. అప్పుడు బుకీలు కూడా స్థానికంగానే ఉండేవారు. దీంతో పోలీసులు వారిపై దృష్టి సారించి కట్టడికి చర్యలు తీసుకునే వారు. కానీ ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ల ద్వారానే బెట్టింగ్ జరుగుతుండటంతో పోలీసులు కూడా కట్టడి చేయలేని పరిస్థితి నెలకొంది. బెట్టింగ్ వేసే మొత్తాన్ని కూడా వివిధ యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. దీంతో చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండి అందులో ఇంటర్నెట్ బ్యాలెన్స్ ఉంటే చాలు మారుమూల ప్రాంతం నుంచి కూడా బెట్టింగ్ కాసే అవకాశం ఏర్పడింది. దీంతో గ్రామీణ యువకులూ బెట్టింగ్ మాఫియా వలలో చిక్కుకుంటున్నారు.

కోడ్ భాషలో బెట్టింగ్‌లు..
క్రికెట్ బెట్టింగ్ నడిపించే ముంబయ్, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై తదితర నగరాలకు చెందిన బుకీలతో జిల్లాలోని పలు పట్టణాలకు చెందిన కొందరికి మంచి సంబంధాలున్నట్లు తెలుస్తోంది. కోడ్ భాషతో ఎవ్వరికీ అనుమానం రాకుండా గుట్టు చప్పుడు కాకుండా వారు ఈ వ్యవహారం సాగిస్తున్నారు. బుకీల దగ్గర రిజిస్టర్ అయిన ఫోన్ నంబర్ల ద్వారా ఫోన్ వస్తేనే వారు స్పందిస్తున్నారు. చెల్లింపులన్నీ గూగుల్ పే, ఫోన్‌పే, ఆన్‌లైన్‌ల ద్వారానే సాగిస్తున్నట్లు తెలిసింది. బుకీలతో సంబంధాలు ఏర్పరచుకున్న వారు 10 నుంచి 15 శాతం దాకా కమీషన్ తీసుకొని స్థానికంగా ఉన్న వారితో బెట్టింగ్‌లు వేయిస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారంలో కొందరు పోలీసుల పాత్ర కూడా ఉన్నట్లు సమాచారం.

పురం, కదిరిలో రూ.కోట్లలో బెట్టింగ్..



ఇంగ్లాండ్– న్యూజిలాండ్ మ్యాచ్ సందర్భంగా ఒక్క హిందూపురంలోనే రూ. 2 కోట్ల దాకా బెట్టింగ్ జరిగినట్లు చర్చ జరుగుతోంది. ఇక శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు 49 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ కాగా, తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్ జట్టు 133 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దీంతో కదిరికి చెందిన చాలా మంది నెదర్లాండ్ 180 పరుగులలోపే ఆలౌట్ అవుతుందని బెట్టింగ్ వేశారు. కానీ ఆ జట్టు బ్యాటర్లు 41 ఓవర్ల వరకూ క్రీజ్‌లో నిలిచి 205 పరుగులు చేశారు. దీంతో నెదర్లాండ్‌పై బెట్టింగ్ వేసిన వారంతా నష్టపోయారు. ఇక శనివారం ఉదయం 10.30 నుంచి ఆఫ్ఘనిస్థాన్–బంగ్లాదేశ్, అలాగే మధ్యాహ్నం 2 నుంచి దక్షిణాఫ్రికా–శ్రీలంక జట్ల మధ్య రెండు మ్యాచ్‌లు కావడంతో బెట్టింగ్‌లు భారీగా సాగాయి.

బెట్టింగ్ కట్టడికి చర్యలు



క్రికెట్ బెట్టింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై గమనిస్తున్నాం. బెట్టింగ్ వేసినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే లాడ్జీలు, హోటళ్లు, ఇంకా పలు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా యువతపై దృష్టి సారించాం. బెట్టింగ్‌లు జరగకుండా చూడాలని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలకు ఆదేశాలిచ్చాం. క్రికెట్‌ను ఎంజాయ్ చేయండి కానీ..ఎవ్వరూ బెట్టింగ్‌ల జోలికి వెళ్లవద్దని నా మనవి. బెట్టింగ్‌లో పోలీసుల ప్రమేయం ఉన్నా కఠినంగానే వ్యవహరిస్తాం.

– ఎస్పీ మాధవరెడ్డి,
సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్

ఖాద్రీశుని సేవలో జిల్లా జడ్జి శ్రీనివాస్



న్యాయమూర్తికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు, చైర్మన్

కదిరి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్ శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిలో సేవలో గడిపారు. ఉదయం ఆయన ఆలయం వద్దకు చేరుకోగానే సిబ్బంది, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జడ్జి శ్రీనివాస్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను వివరించి పూలమాలతో సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందజేసి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎంసీఏ, ఎంబీఏ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ (ఆర్–20), (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ రెండో రెండో సెమిస్టర్ (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి. చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- పుట్టపర్తి –మదనపల్లి నూతన సర్వీసు ప్రారంభం



పుట్టపర్తి- మదనపల్లి నూతన సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పుట్టపర్తి– కదిరి– మదనపల్లి ఆర్టీసీ నూతన సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సత్య సాయి బాబా ఆశీస్సులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడిందన్నారు. దీంతో జిల్లా కేంద్రానికి జనం తాకిడి పెరగడంతో ఆర్టీసీ కూడా వివిధ రూట్లలో సర్వీసులు పెంచుతోందన్నారు. అందులో భాగంగానే పుట్టపర్తి –మదనపల్లి నూతన సర్వీసులు ప్రారంభించామన్నారు. ఈ బస్సు మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తి బస్టాండ్‌లో బయలుదేరి నల్లమాడ, ఓడీచెరువు, అమడుగూరు కొక్కంటిపల్లి క్రాస్ మీదుగా సాయంత్రం 5 గంటలకు మదనపల్లికి చేరుతుందన్నారు. అక్కడ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు అమడుగూరుకు వస్తుందన్నారు. మరుసటి రోజు ఉదయం 5 గంటలకు అమడుగూరులో బయలుదేరి 7 గంటలకు మదనపల్లికి చేరుతుందన్నారు. మదనపల్లిలో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు పుట్టపర్తికి వస్తుందన్నారు. ప్రయాణికులు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీటీఓ మదుసూధన్, డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీ పెద్దన్నతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- పెడపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి తదితరులు



వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలు

పుట్టపర్తి అర్బన్: ‘జగనన్న ఆరోగ్య సురక్ష’కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. శనివారం పుట్టపర్తి మండలం పెడపల్లి–1 సచివాలయం పరిధిలో నిర్వహించిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ప్రత్యేకాధికారి శుభదాస్, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన వారిని పరీక్షించి అవసరమైన మందులు సైతం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సచివాలయ స్థాయిలో స్పెషలిస్టులతో వైద్యం చేయిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. ‘జగనన్న ఆరోగ్య సురక్ష’లాంటి కార్యక్రమంలో దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 14 రకాల జబ్బులకు ఉచితంగా పరీక్షలు, 105 రకాల మందులను అందజేస్తున్నారన్నారు. సాధారణ జబ్బులకు స్థానిక వైద్య శిబిరాల్లోనే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందిస్తున్నారని, తీవ్ర జబ్బులతో బాధపడుతున్న వారిని ఆరోగ్యశ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపి నాణ్యమైన వైద్యం ఉచితంగానే అందజేస్తున్నారన్నారు.

147 కేంద్రాల్లో వైద్య సేవలు
శనివారం జిల్లాలోని 24 ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకూ మొత్తం 147 కేంద్రాల్లో వైద్య సేవలు అందించామని డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాల్లో సుమారు 48,508 మందికి వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందజేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ ముందురోజే చాటింపు వేయించడం, పోస్టర్లు అతికించడం, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి శిబిరం గురించి తెలియజేస్తుండటంతో వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసారెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, సొసైటీ అధ్యక్షురాలు ఉషారాణి, వైద్యాధికారులు నాగరాజు నాయక్, నాగదుర్గా దేవి, షారుక్, సర్పంచ్ మంగ్లీబాయి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ గంగాద్రి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల మార్పు ప్రక్రియ పూర్తి చేయండి


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

హిందూపురం టౌన్: హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలు, వాటి పేర్ల మార్పును త్వరతగతిన పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో కలిసి పోలింగ్ కేంద్రాల మార్పుపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జేసీ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో 18 పోలింగ్ కేంద్రాల ప్రదేశాలను మార్పులు చేస్తున్నామన్నారు. హిందూపురం రూరల్‌లో 1, అర్బన్‌లో 13, లేపాక్షి, చిలమత్తూరులో రెండు ఉన్నాయన్నారు. దీంతో పాటు హిందూపురం రూరల్‌లో 2, చిలమత్తూరులో 14 కేంద్రాల పేర్లు మారుస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఆమోదించారన్నారు. ఫారం-6 ద్వారా 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితాలో తొలగించడం కోసం ఫారం-7ను కుటుంబీకులు డెట్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ కార్డులో మార్పులు, చేర్పులు ఉంటే ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫీల్డ్ ఎంక్వైరీ చేసి ఆన్‌లైన్ అప్లికేషన్‌లో లాగిన్‌లో క్లియర్ చేయాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, లేపాక్షి, చిలమత్తూరు తహసీల్దార్లు బాబు, నాగరాజు, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ పరిధిలోకి 'ఎస్ఈఐ' ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఉన్న సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజన్ (ఎస్ఈఐ) అధ్యయన కేంద్రంలో పనిచేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇక నుంచి వర్సిటీ లేదా యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) నుంచి జీతాలు చెల్లించాలని రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జే. శ్యామల రావు ఉత్తర్వులు జారీ చేశారు. 16 సంవత్సరాలుగా యూజీసీ కింద ఈ కేంద్రం పనిచేస్తోంది. ఇది వరకు యూజీసీనే వీరికి జీతాలు చెల్లిస్తోంది. అయితే, ఈ అధ్యయన కేంద్రంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి చెల్లిస్తున్న జీతాలను ఇక నుంచి నేరుగా బ్లాక్‌గ్రాంట్ నుంచి అందించాలని ఆదేశాలు అందాయి. ఒకవేళ యూజీసీ నిధులు మంజూరు చేస్తే యథాతథంగా జీతాలు, అధ్యయన కేంద్రానికి సంబంధించిన పరిశోధనలు నిర్వహిస్తారు.

హంద్రీ-నీవాలో వారాబందీ

- అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాల పంపిణీకి అధికారుల నిర్ణయం
- 10 నుంచి 20 వరకూ గుంతకల్లు డివిజన్‌లో తూములకు నీటి నిలుపుదల

అనంతపురం సెంట్రల్: శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా ద్వారా జిల్లాకు వస్తున్న కృష్ణా జలాలను అన్ని ప్రాంతాలకు సమంగా పంపిణీ చేసేందుకు అధికారులు వారాబందీ (ఆన్‌అండ్‌ఆఫ్) అమలుకు శ్రీకారం చుడుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో శ్రీశైలం జలాశయానికి ఆశించిన స్థాయిలో నీరు రాలేదు. ఈ క్రమంలో తక్కువ సమయంలో వీలైనంత ఎక్కువ నీటిని తీసుకురావడంతో పాటు అన్ని ప్రాంతాలకు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నీటి అవసరాలు తీర్చేందుకే..

నాలుగేళ్లుగా జిల్లా వాసులను ఆదుకున్న హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ఈ ఏడాది నీటి ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ మొత్తం వర్షాకాలంలో శ్రీశైలం జలాశయం ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో నిండలేదు. అయినప్పటికీ జిల్లాలో నీటి అవసరాల దృష్ట్యా వీలైనంత ఎక్కువ నీటిని తీసుకొస్తున్నారు. అయితే, జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో నీటి అవసరాలు అధికమవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం నుంచి హంద్రీ-నీవా ద్వారా జిల్లా సరిహద్దులో 1,386 క్యూసెక్కుల నీరు వస్తోంది. గుంతకల్లు డివిజన్‌లో ఆలూరు బ్రాంచ్ కెనాల్, గుత్తి బ్రాంచ్ కెనాల్‌తో పాటు చెరువులు అధికంగా ఉన్నాయి. దీంతో దాదాపు 600 క్యూసెక్కుల నీటిని ఇంత వరకూ వాడుతూ వచ్చారు. జీడిపల్లి జలాశయం నుంచి దిగువన



శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ	92.486 టీఎంసీలు
హంద్రీ-నీవా ద్వారా జిల్లాకు వస్తున్న కృష్ణాజలాలు	1,386 క్యూసెక్కులు
జీడిపల్లి జలాశయంలోకి వస్తున్న నీరు	648 క్యూసెక్కులు
చెర్లోపల్లికి..	100 క్యూసెక్కులు
ఇంకా నింపాల్సిన రిజర్వాయర్లు	మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కుప్పం వరకూ...

ఉన్న మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లతో పాటు పుంగనూరు బ్రాంచ్ కెనాల్, కుప్పంకు నీటిని తీసుకెళ్లేందుకు ఆయా రిజర్వాయర్లలో నీరు నిల్వ చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జీడిపల్లి నుంచి చెర్లోపల్లి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే అక్కడికి చేరేలోపు కేవలం 100 క్యూసెక్కులలోపే నీరు ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతికి అధికారులు శ్రీకారం చుడుతున్నారు. గుంతకల్లు డివిజన్‌లో 600 క్యూసెక్కుల నీటి వినియోగం తగ్గితే, కిందకు సులువగా వేగంగా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

శ్రీశైలంలో 92 టీఎంసీలు..

ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 92 టీఎంసీల నీటి నిల్వ ఉంది. హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకానికి 53 టీఎంసీల(834 అడుగులు) వరకూ నీటిని తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. దీన్నిబట్టి చూస్తే మరికొన్ని నెలల పాటు హంద్రీ-నీవాకు కృష్ణాజలాలు రానున్నాయి. ఈ లోగా మంచి వర్షాలు వస్తే నవంబర్, డిసెంబర్ వరకూ ఢోకా లేదని అధికారులు చెబుతున్నారు. పంటల సాగుకు లేదని,ఇదివరకే ఐఏబీ(సాగునీటి సలహా మండలి) సమావేశంలో నిర్ణయం తీసుకున్నా, రైతుల సంక్షేమం దృష్ట్యా నీటిని వదులుతున్నారు. అన్ని ప్రాంతాలకు నీటిని పంపిణీ చేసి రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందుల ఎదురు కాకుండా ఉండేందుకు కృష్ణాజలాలు దిగువకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. అందులో భాగంగా గుంతకల్లు డివిజన్‌లో ఈనెల 10 నుంచి 20 తేదీ వరకూ తూములకు నీటిని నిలుపుదల చేయాలని నిర్ణయించారు. 20 తేదీ తర్వాత మళ్లీ విడుదల చేయనున్నారు.

రైతులు సహకరించాలి

జిల్లాలో అన్ని ప్రాంతాలకు సమానంగా కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా వారాబందీ (ఆన్‌అండ్‌ఆఫ్) పద్ధతిని అమలు చేస్తున్నాం. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు దిగువకు నీరు వెళ్లేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. మెయిన్‌కెనాల్‌లో నిరంతరంగా నీరు సరఫరా అయ్యేందుకు రైతులు, ప్రజలు సహకరించాలి. గుంతకల్లు డివిజన్‌లో 10 రోజుల పాటు నీటిని నిలుపుదల చేస్తున్నాం. తర్వాత మళ్లీ విడుదల చేస్తాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– దేశేనాయక్, ఎస్ఈ, హంద్రీ-నీవా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన కంబగిరి రాముడు

తాడిపత్రి అర్బన్: ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ వ్యక్తిని గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ కథనం మేరకు.. యాడికి మండలం వేములపాడుకు చెందిన మాజీ సర్పంచ్ చిటికెల కంబగిరి రాముడు (57) శనివారం ఉదయం తన టీవీఎస్ ఎక్సెల్‌లో తాడిపత్రికి పనుల నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అశోక్‌పిల్లర్ సమీపంలో ఇండియన్ గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. కిందపడిన కంబగిరి రాముడు పొట్టపై లారీ ముందు టైరు వెళ్లింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలపడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

పాము కాటుతో విద్యార్థి మృతి


హేమంత్‌కుమార్ (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన తిప్పేస్వామి, పుట్టనరసమ్మ దంపతుల కుమారుడు టి.హేమంత్‌కుమార్ (9) పాము కాటుకు గురై మృతి చెందాడు. శనివారం ఉదయం ఇంటి సమీపాన గల పేడదిబ్బలోకి వెళ్లడంతో పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు కనుక్కొని వెంటనే స్థానికంగా నాటు వైద్యం చేయించారు. ఫలితం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం మధుగిరికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రాణాలు వదిలాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. హేమంత్ కుమార్ రొళ్లలో ఉన్న బాలాజీ రూరల్ అప్పర్ ప్రైమరీ ప్రైవేట్ పాఠశాలలో నాల్గవ తరగతి విద్య అభ్యసిస్తున్నట్లు తెలిసింది.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్


మాట్లాడుతున్న కమాండెంట్ మహేష్ కుమార్

అనంతపురం క్రైం: క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురం యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులతో పరేడ్, దర్బార్ కార్యక్రమాలను శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను నిత్యం గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నైపుణ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రయాణ సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్‌లు రెన్యూవల్ అవుతున్నాయా లేదా చూసుకోవాలన్నారు. సమస్య వస్తే సబ్ డివిజన్ ఇన్‌చార్జ్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించాలనే విషయాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో హెచ్‌జీఎస్ డీఎస్పీ మునిరాజ, హెచ్‌జీఎస్ ఆర్ఐ హరికృష్ణ, హెచ్‌జీఎస్ ఆర్ఎస్ఐ మక్బూల్, శ్రీరాముడు, సబ్ డివిజన్ల హోంగార్డుల ఇన్‌చార్జ్‌లు, హోంగార్డులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

తలుపుల: మండలంలోని తురకవాండ్లపల్లి పాత ఊరులోని పాండవుల గుడిలో శుక్రవారం రాత్రి గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు చేపట్టారు. తన పొలంలోకి కాపలా వెళ్తున్న తురకవాండ్లపల్లికి చెందిన లోకేష్.. గుడి వద్ద లైట్ల వెలుతురు గుర్తించి, కొత్త తురకవాండ్లపల్లికి వెళ్లి గ్రామస్తులకు సమాచారం చేరవేశాడు. దీంతో అందరూ అక్కడికి వెళ్లగా, గుప్తనిధుల దొంగలు పారిపోయారు. తురక వాండ్లపల్లికి చెందిన రెడ్డిపల్లి వీరనారప్ప, ఇతని కుమారుడు మహేశ్, దేవరపల్లికి చెందిన పాలగిరి మారెప్పను దుండగులుగా గ్రామస్తులు గుర్తించారు. పోలీసులకు శనివారం గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గురప్ప తెలిపారు.

జగన్ హయాంలోనే బీసీలకు న్యాయం

- 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎందే
- రాష్ట్ర బీసీ కార్పొరేషన్ల కో ఆర్డినేటర్ ప్రవీణ్


మాట్లాడుతున్న ప్రవీణ్

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే బీసీలకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ల కోఆర్డినేటర్ ప్రవీణ్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ల సమావేశం చైర్‌పర్సన్ డాక్టర్ నళిని అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కులాల వారీగా బీసీలకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌దేనని తెలిపారు. నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలను ఓబీసీలుగా గుర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రి చేయడానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో బీసీలు ఎంతగానో లబ్ధి పొందారన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు ఏరోజు కూడా బీసీలను పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడానికి కష్టపడి పని చేయాలన్నారు. విరివిగా సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్లు మాట్లాడుతూ కుంచిటి వక్కలిగలను ఓబీసీలుగా గుర్తించాలన్నారు. మడకశిర ప్రాంతానికి పూర్తి స్థాయిలో కృష్ణా జలాలు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్లకు ప్రోటోకాల్ వర్తించేలా చూడాలన్నారు. సాదర కులస్తులను కూడా ఓబీసీలుగా గుర్తించాలని కోరుతూ ఆసంఘం నాయకులు ప్రవీణ్‌కు వినతి పత్రాన్ని అందించారు. సమావేశంలో డైరెక్టర్లు నాగరాజగౌడ్, నాగన్న,రాజేశ్వరి, వీక్యాతరాయప్ప, గగన, అన్నపూర్ణమ్మ, నాగలక్ష్మమ్మ, అనిత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పుట్టకామప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగేగౌడ్, నారాయణప్ప, చిక్కన్న, శ్రీరామప్ప, శివకుమార్, వేణు, మల్లికార్జున, నరసేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పొలం పనులు చేస్తూ రైతు మృతి


మృతి చెందిన నరసింహమూర్తి

చిలమత్తూరు: మండలంలోని ఆదేపల్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తి (42) అనే రైతు పొలం పనులు చేస్తూ మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. ధనియాలు చల్లేందుకు పొలం సిద్ధం చేయాలని శనివారం ఉదయం నరసింహమూర్తి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. పొలం వద్దకు వెళ్లి చూస్తే విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా.. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. గుండె పోటుతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దుస్తుల దుకాణ యజమానికి మస్కా

- రూ. 55 వేల చోరీ

ఉరవకొండ: ఓ వ్యక్తి దుస్తుల దుకాణ యజమానికి మస్కా కొట్టాడు. రూ. 55 వేలు చోరీ చేశాడు. ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్ వివరాల మేరకు.. స్థానిక గుంతకల్లు రోడ్డులో కేబీన్ కాటన్ సెంటర్ పేరిట అల్లాబకష్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం ఓ 40 ఏళ్ల వ్యక్తి ఇక్కడికి వచ్చాడు. రెండు జతల బట్టలు కొన్నాడు. ఈ క్రమంలోనే అల్లాబకష్‌ను మాటల్లో పెట్టి క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ. 55 వేలు ఎత్తుకెళ్లాడు. కొంత సమయం తర్వాత ఈ విషయం గుర్తించిన అల్లాబకష్ దొంగను పట్టుకోవడానికి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ

- మున్సిపల్ కమిషనర్ పేరుతో అక్రమ వసూళ్లు



గుంతకల్లుటౌన్: సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో మోసాలకు తెగబడుతున్నారు. తాజాగా గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌నంటూ ఓ సైబర్ నేరగాడు (ట్రూ కాలర్ ఆధారంగా అతని పేరు జశ్వంత్‌రెడ్డి) 63095 90391, 63095 90392, 86882 68041 నంబర్ల నుంచి ఫోన్ చేసి ట్రేడ్ లైసెన్సు రెన్యూవల్ ఫీజు చెల్లించాలని పలువురిని కోరాడు. ఫీజు చెల్లించకపోతే షాపు సీజ్‌చేస్తామని ఓ జ్యువెలరీ షాపు, ఓ రెస్టారెంట్ నిర్వాహకుడితో పాటు మరికొంత మందిని భయపెట్టి, ఒక్కొక్కరి నుంచి రూ.1000 ప్రకారం ఫోన్ పే ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నకిలీ కమిషనర్ ఆడియో కాస్తా అన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్పందించారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని శనివారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఫోన్ ద్వారా బకాయిలు, ట్రేడ్ లైసెన్సు ఫీజులు అడగరని స్పష్టం చేశారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే కార్యాలయ అధికారులను సంప్రదించాలన్నారు.

'మిషన్ వాత్సల్య' అమలులో జాప్యమేల?

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నెలకు రూ.4 వేల ఉపకార వేతనం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'మిషన్ వాత్సల్య' పథకం అమలులో ఎందుకు జాప్యం జరుగుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘం-5 (స్త్రీ, శిశు సంక్షేమ శాఖ) సమావేశం శనివారం బెళుగుప్ప జెడ్పీటీసీ సభ్యురాలు మమత అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో పాటు తాడిపత్రి, తాడిమర్రి జెడ్పీటీసీ సభ్యులు కురుబ రమణమ్మ, పారాళ్ల సావిత్రి హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకానికి అర్హులను ఎంపిక చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి స్పందిస్తూ.. దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు అందలేదని, ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

- జనాభాకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తాడిపత్రి జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ కోరారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకూ గ్రేడ్-2 సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. తాడిమర్రి జెడ్పీటీసీ సభ్యురాలు సావిత్రి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాసిరకం సరుకులు పంపుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాల్య వివాహాల నిర్మూలనకు నెలకోసారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు.
- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణతో పాటు మిషన్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతిపాదనలు, అంచనాలు తయారు చేసి పంపితే, ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు.

సాయి వైభవం.. ప్రేమ మయం


సత్యసాయి బోధనలను చాటుతూ చిన్నారుల ర్యాలీ


సంగీత కచేరీ నిర్వహిస్తున్న కోనసీమ జిల్లా సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి సన్నిధిలో శనివారం కోనసీమ సత్యసాయి భక్తులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మంత్రముగ్ధులను చేశాయి. యూత్ సభ్యులు 'సాయి ప్రేమ' పేరుతో నిర్వహించిన నాటిక ఆకట్టుకుంది. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో కోనసీమ భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు సత్యసాయి సందేశాలు, ఆయన బోధించిన విలువలను చాటే ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా శిక్షణ పొందిన యువత గ్రామ సీమలలో ప్రజలకు చేస్తున్న సేవలను వివరిస్తూ నిర్వహించిన నాటిక భక్తులను అమితంగా ఆకట్టుకుంది. సత్యసాయి పూర్వ భక్తుడు డాక్టర్ కె.ప్రభాకర్ సాయి ప్రభ అన్న పేరుతో రాసిన పుస్తకాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు విడుదల చేశారు.